

# బోను

-కుమారి ఎ.వి.శేషారత్నం

కోర్టు ఆవరణలో చెట్టుక్రింద నిలబడి ఎదురు చూస్తున్నాడు సత్యం. కర్చీఫ్‌తో ముఖానికి పట్టిన చెమట తుడిచి, తిరుపతి రాజు వచ్చి రావడంతోనే చేతులు నలుపుకుంటూ – 'నా డబ్బులిప్పిస్తే.....' ఆగాడు.

'కాస్త ఆగవయ్యా ఇంటికొచ్చి తీసుకో – ఎక్కడబడితే అక్కడ చెయ్యిచాపకు – ప్రమాదం – ఇన్నాళ్ళుబట్టి ఈ పని చేస్తున్నావు. ఇంకా ఎప్పుడు తెలిసొస్తుందయ్యా నీకు?'

'అవసరం తీరాక అలాగే మాట్లాడతారు లెండి బాబూ! ఎంత అవసరంలో ఉండి అడిగానో అనుకోరుగా–నాలుక తెగేలా చెప్పాను కట్టు కథలు–'

'మహ కష్టపడ్డావులే– అబద్ధం చెప్పడం కూడ కష్టమే నంటావ్– సరే ఈ సారి మరో పార్టీని చూసుకుంటానులే.'

'అమ్మమ్మ అంతమాటంటే నేను, నా కుటుంబం ఏమయి పోవాలి బాబూ! ఏదో నోరు తిమ్మిరెక్కి వాగాను. సాయంత్రం కలుస్తాను తమరింటి దగ్గర–'

'పొద్దు పోయాక రా– లాయర్‌గారు స్కూటరెక్కేసారు–

ఆరోజు రాత్రి తిరుపతిరాజు ఇచ్చిన ఏభైరొంటిన దోపుకుంటూ– 'మొదట డెబ్భై అయిదుకు బేరం ఆడారు. ఏభై చేతిలో పెట్టారు. న్యాయం చచ్చిపోయింది. అబద్ధం సాక్ష్యం చెప్తున్నానని తెలిస్తే నా పీక ఎగిరిపోతుంది ఏక్షణానైనా'– గొణుక్కున్నాడు సత్యం.

'ఏమిటో య్'–

'ఏం లేదు బాబూ మళ్ళీ ఎప్పుడు కనబడమంటారు?''ఇప్పుడప్పుడే వద్దులే– అవసరమైతే కబురంపుతాను. ఏ ఊరన్నా వెళ్ళాలంటే మాత్రం చెప్పి మరి వెళ్ళు సత్యం?' అన్నాడు లాయరుగారు హుషారుగా–

'చిత్తం'–

అవతల పార్టీ దగ్గర నాలుగు వేలన్నా కిట్టివుంటుంది. గురుడికి, జోరెక్కువగా ఉంది. ఏంటో? ఎంతో గొంతు చించుకుని ఎన్నో రకాలుగా నటిస్తూవస్తే ఇంతా చేసి ముష్టి ఏభై రూపాయిలు. పోనీ చచ్చినాడి పెళ్ళికి వచ్చిందే కట్నం–'

మందు పుచ్చుకున్నాక పూర్తిగా గుఱ్ఱమెక్కేసాడు సత్యం– 'కోర్టులో న్యాయదేవతకి కళ్ళు ఎందుకు కట్టేసారో అనుకునేవాడిని కొత్తలో– ఇప్పుడు తెలిసింది– ఆవిడకి చూపు అగపడదని. ఇంకానయం – చెవిటిది కూడ అయితే నాబోటి గాళ్ళ జీవితాలు వెళ్ళేదెట్లా? లలలా.....ల'–ఈల వేసుకుంటూ సైకిలుమీద- జోరుగా వస్తున్నాడు రాత్రి బాగా పొద్దుపోయాక–

సగందూరం వచ్చేసరికి సైకిల్ ట్యూబ్ కాస్తా ఫట్‌మంది కీచుగా అరుస్తూ–

విసుగ్గా సైకిల్‌ను పేవ్‌మెంటు మీదికి లాక్కొచ్చాడు– మసక చీకట్లో ఆ పేవ్‌మెంటు మీద మూలుగు వినిపిస్తోంది. ఒక యువతి 'రక్తం మడుగులో కొట్టుకుంటోంది.

కళ్ళు నులుముకుని మరీ చూసాడు సత్యం–

ఆ యువతి సత్యాన్ని చూసి 'దాహం' అన్నట్టుగా సైగ చేసింది.

డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళామన్నా వ్యవధిలేదు. దూరంగా ట్యూబ్‌లైటు వెలుతురు– పరిగెత్తుకుంటూ వెళ్ళేసరికి ఒకే ఒక్క కిళ్ళీకొట్టు తెరిచి వుంది.

షాక్‌తో నోటమాట రావడంలేదు సత్యానికి – కొట్లోని ఐస్ బాక్స్ తెరిచి తనే ఒ సోడా తీసుకుని పరుగెత్తాడు వేగంగా– అనుకోని చర్యకి కిళ్ళీకొట్టువాడు అయోమయంగా చూసి 'దొంగ దొంగ' అంటూ అరిచాడు. సత్యం వెంటబడ్డాడు. అతనికేకలకి మరో ఇద్దరు పరిగెత్తారు.

సత్యం శ్రమ ఫలించలేదు. సోడా కొట్టి ఆమెను లేవనెత్తి తాగిస్తూండగానే కళ్ళు మూసిందా యువతి

'యు ఆర్ అండర్ అరెస్ట్'– సినిమాలోలా పోలీసులు ప్రత్యక్ష మయారు.

సత్యం గొంతు పొడారిపోయింది. 'నేను..... నేను.....' మతి చెలించిన వాడిలా పరిగెత్తబోయాడు. కిళ్ళీకొట్టువాడు, మరో యిద్దరు ఎదురుగా వచ్చి పట్టుకున్నారు.

'రాస్కెల్ హత్య చేసి తప్పించుకు పోదామనుకుంటున్నావా? అతనెవరో వెంటనే చూసి ఫోన్ చెయ్యబట్టి రెడ్ హేండెడ్‌గా దొరికావు. పద–' జులుం చెలాయించింది టోపీ–

సత్యం గింజుకున్నాడు–

లబోదిబో మన్నాడు–

కాళ్ళు పట్టుకున్నాడు–

కానీ కటకటాలు తప్పలేదు. బెయిల్ కూడ దొరకలేదు.

★ ★ ★

'యువరానర్! ముద్దాయి హత్య చేస్తుండగా చూసిన ఆఖరిసాక్షి కిళ్ళీకొట్టు ఓనర్ రాములును ప్రవేశ పెట్టవలసిందిగా కోరుతున్నాను' లాయర్ తిరుపతిరాజు కంఠం గంభీరంగా ఉంది

రాములు వణుకుతున్నాడు.

'ఏం భయంలేదు. ముద్దాయి నిన్నేమీ చెయ్యలేడు'– లాయర్ ఓదార్చాడు రాముల్ని.

'దేవుని మీద ప్రమాణం చేసి అంతా నిజమే చెప్తాను అబద్ధం చెప్పను.' – బోనులో ఉన్నాడు రానులు.

రాములు మాటలు వింటూంటే భోరుమని ఏడ్చాడు సత్యం.

ఇవే మాటలు గత సంవత్సరం నుంచే తను ఆరుసార్లేనా చెప్పి ఉంటాడు, ఆ బోనెక్కితే మనిషి మారిపోతున్నాడు. ఆత్మ చచ్చిపోతుంది.

'ముద్దాయి నీకెలా పరిచయం ?'

'చచ్చిపోయింది చూసారా ఆ పిల్లను తీసుకుని నాలుగైదు సార్లు నా కొట్టు దగ్గరే సోడా తాగేవాడండి.'

'అబద్ధం'– గింజుకున్నాడు సత్యం–

'ఆర్డర్'– మందలించారు జడ్జిగారు.

'ఆడపిల్ల, ఇతను పకపకలాడుకునేవారండి. ఈమధ్య వారం రోజుల నుంచి మాత్రం జంటగా అగపళ్ళేదండి. ఆ అమ్మాయి, ఇతను ఆ రోజు సోడాలు తాగాక చాలసేపు దెబ్బలాడుకున్నారండి. 'నీ అంతు చూస్తాను'– అన్నాడండి– వేళాకోళం అనుకున్నానండి. కానీ ఆళ్ళిద్దరూ కసింత దూరమైనా వెళ్ళకముందే కెవ్వున కేక ఇనబడింది. పరిగెత్తుకు చూద్దునుకదా ఆ అమ్మాయి రక్తంలో కొట్టుకుంటోందండి. నన్నూ, ఆళ్ళిద్దరు మనుషుల్ని చూసి ఇతను పరిగెత్తబోయాడండి

'ఇంక నువ్వెళ్ళవచ్చు' – రాములు బోను దిగిపోయాడు.

'పచ్చి అబద్ధం' నాకతను తెలియనే తెలియదు. ఆ పిల్లని నేనెప్పుడూ చూళ్ళేదు.'

న్యాయదేవతకి మొరబెట్టుకున్నాడు సత్యం–

కిలకిల నవ్వినట్టు వినిపించింది సత్యానికి.

'నాకు నువ్వు కనిపించడం లేదు సత్యం – నీ మాటలు కూడ వినిపించడం లేదు.' అంటున్నట్టు భ్రమ–

'ఎంతమంది ఉసురో పోసుకున్నాను అబద్ధం సాక్ష్యాలు చెప్పి, నాకీ జన్మలోనే తగిలింది.' – బావురుమన్నాడు సత్యం– న్యాయస్థానం అతనికి యావజ్జీవ ఖైదు శిక్ష విధించాక పోలీసులు సత్యాన్ని వేన్ ఎక్కిస్తూంటే అప్రయత్నంగా అతను చెట్టు – తను ఎప్పుడూ నించునే చెట్టు వైపు చూసాడు.

లాయర్ తిరుపతిరాజు – రాములుతో చేతులు తిప్పుతూ ఏదో మాట్లాడుతున్నాడు. సత్యం మనసు చచ్చిపోయింది.

'ఒక యువతితో అక్రమ సంబంధం ఎర్పరచుకుని అవసరం తీరాక– ఆమెను పెళ్ళాడవలసి వస్తోందని నిర్దాక్షిణ్యంగా రోడ్డు మీద ఆవేశంతో కత్తితో హత్య చేసిన ముద్దాయి నేరం సాక్ష్యాధారాలతో ఋజువైనందున....' జడ్జిగారి తీర్పు పదే పదే వినిపిస్తోంది అతని చెవిలో –

'యావజ్జీవ ఖైదు –'హహ్హహ'– ఎన్నో గొంతులు కసిగా నవ్వుకున్నాయి.

'ఒరేయ్ సత్యం! నీ సాక్ష్యం మూలంగా నన్నురితీసార్రా?' – ఆ యువకుడు మీది మీది కొస్తున్నాడు.

'చెయ్యని దొంగతనాన్ని నాకంటగట్టి నా పరువు గంగలో కలిపావురా – ఆ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్నానురా' – సుబ్బరామయ్య కసిగా పళ్ళు కొరికాడు.

'నీ సాక్ష్యం వల్ల నా పిల్లల ఆస్తిని దాయాదులు కాకుల్లా ఎగరేసుకుపోయారురా'– రమణమ్మ ఏడుస్తోంది.

ఇంకా ఇంకా ఎందరో అభాగ్యులు పెద్ద సైన్యంలా వచ్చి పడుతున్నారు. గొంతు పట్టుకున్నారు.

సత్యానికి ఊపిరందడం లేదు.

'అయ్యయ్యో ఏమిటండీ ఆ చెమటలు. ఏమయింది పీడకలేమన్నా వచ్చిందా?' – కుదిపి లేపింది కనకం.

నీరసంగా మూలిగాడు సత్యం–

'కాస్త మంచినీళ్ళు–' గొంతంతా ఎవరో నులిమినట్టు మంట పుడుతోంది. బహుశా నిద్దట్లో తనే....అమ్మో ఇదంతా కలా? ఇది నిజమైతే?ఎందుకవుతుంది? ఎందుకు కాకూడదు? ఆ లాయరు కర్కోటకుడు. ఇవాళ తనని ఉపయోగించుకుని డబ్బు చేసుకున్నట్టే అవసరమైతే తన పీకల మీదికి వచ్చినపుడూ చేస్తాడు.

ఆ బోనెక్కితే డబ్బు తప్ప మానవత్వం మర్చిపోతున్నాడుతను–

మర్నాడు ఎర్రబడ్డ కళ్ళతో, వాడిపోయిన మొహంతో నీరసంగా వచ్చిన సత్యాన్ని చూసి విస్తుపోయాడు లాయర్ తిరుపతిరాజు.

'నేను మాత్రం ఇకమీదట సాక్ష్యాలు చెప్పదలుచుకోలేదు బాబూ! రాళ్ళు కొట్టి అయినా బతుకుతాను గానీ ఆ రక్తపు కూడు నాకొద్దు. రంగబాబుగారి హత్య కేసులో సాక్ష్యం చెప్పమని మీరిచ్చిన రెండు వందలూ ఇవిగో–'

డబ్బు టేబుల్ మీద పెట్టి పిలుస్తున్నా వినిపించుకోకుండా నడచిపోతున్న వెనుతిరగని సత్యాన్ని చూసి నోరు తెరిచారు తిరుపతిరాజుగారు.

'పిరికివాడు'– సొరుగులో రెండు వందలూ భద్రం చేసి విసుక్కున్నాడాయన. □